సాక్షి
కామారెడ్డి
సోమవారం । 31 । మార్చి । 2025



నల్లపోచమ్మ జాతర

గోపాల్‌పేటలో నల్లపోచమ్మ ఆలయ ఉత్స వాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు.

- 8లో ▸



కాడెద్దులు @ రూ.3వేలు

యాంత్రీకరణతో కాడెద్దులు కరువవు తున్నాయి. దీంతో రైతులు పండుగల కోసం ఎడ్లను అద్దెకు తెచ్చుకుంటున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
39.8 /21.7

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృ తమవుతుంది. ఈదురు గాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

నేడు రంజాన్



జిల్లా కేంద్రంలో ప్రార్థనలకు ముస్తాబైన ఈద్గా

కామారెడ్డి టౌన్ : ముస్లింలు సోమవారం రంజాన్ పండుగ జరుపుకోనున్నారు. ఈ నే పథ్యంలో జిల్లాలోని ఈద్గాలను ప్రార్థనలకు సిద్ధం చేశారు. జిల్లా కేంద్రంలోని పెద్దబజా ర్, కోర్టురోడ్, బతుకమ్మకుంట, అశోక్‌నగర్ కాలనీ, పాతబస్టాండ్‌లలో గల మసీదులకు రంగులు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరిం చారు. పండుగ సందర్భంగా ముస్లింలు సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు.



కామారెడ్డి వీక్లీమార్కెట్‌లో ఎడ్లబండ్ల ప్రదర్శన

సంబురంగా ఉగాది

జిల్లావాసులు ఆదివారం ఉగాది పండుగను సంబురంగా జరుపుకున్నారు. ప్రజలు విశ్వా వసు నామ సంవత్సరానికి ఘన స్వాగతం పలుకుతూ ప్రత్యేక పూజలు చేశారు. ఉగాది పచ్చడి సేవించారు. సాయంత్రం ఆలయాలకు వెళ్లి పంచాంగ శ్రవణంలో పాల్గొ న్నారు. పండుగ సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాలలో ఉత్సాహంగా ఎడ్లబండ్ల ప్రదర్శనలు, కుస్తీ పోటీలు సాగాయి. ఎద్దు లకు కొరత ఏర్పడడంతో ట్రాక్టర్లతో ప్రదర్శనల్లో పాల్గొన్నారు. పలు ప్రాంతాలలో కోలాటం, జడకొప్పులాట ఆడారు.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి



కామారెడ్డిలోని విద్యానగర్ సాయిబాబా ఆలయంలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న స్థానికులు



పచ్చడి సేవిస్తున్న కలెక్టర్ సంగ్వాన్, అధికారులు

కామారెడ్డి టౌన్: కలెక్టరేట్‌లో టీఎన్జీవోస్, టీజీవోల ఆధ్వర్యంలో ఉగాది పంచాంగ శ్రవణం కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.



బీర్కూర్‌లో కుస్తీ పోటీలలో తలపడుతున్న మల్లయోధులు



తాడ్వాయిలో ఎడ్లబండ్లకు బదులు ట్రాక్టర్లతో ప్రదర్శన



గాంధారిలో జడకొప్పు కోలాటం ఆడుతున్న ప్రజలు



జిల్లా కేంద్రంలో ఎడ్లబండ్ల ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేవీఆర్

బండెనక బండికట్టి..

- జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున ఎడ్లబండ్ల ప్రదర్శన
- భారీగా తరలివచ్చిన జనం

కామారెడ్డి టౌన్ : ఉగాది పర్వదినం సంద ర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలో ఎడ్లబం డ్ల ప్రదర్శన నిర్వహించారు. వీక్లీమార్కెట్‌లో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు విజయాలతో ముం దుకుసాగాలని ఆకాంక్షించారు. ఆయా కుల సంఘాలు, యువజన సంఘాల ప్రతినిధు లు ఎడ్లబండ్లను అందంగా ముస్తాబు చేసి ప్రదర్శనలో పాల్గొన్నారు. ఆలయాలచుట్టూ ప్రదక్షిణల అనంతరం పాంచ్ రస్తా, గర్ల్స్ హై స్కూల్, హరిజనవాడ మీదుగా పెద్దమ్మ ఆల యానికి చేరుకుని అక్కడ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కార్యక్రమంలో 50కి పైగా ఎడ్లబండ్లు పాల్గొన్నాయి. ప్రదర్శనను వీక్షించడానికి చుట్టుపక్కల మండలాల నుం చి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. కార్య క్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీనివా స్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

స్వల్పంగా పెరిగిన ఉపాధి కూలి ధర

- రూ.300 నుంచి 307కు పెంపు
- రేపటి నుంచి అమలులోకి..

మోర్తాడ్(బాల్కొండ): ఉపాధిహామీ పథకం లో చెల్లించే కూలి స్వల్పంగా పెరిగింది. రూ.300 నుంచి రూ.307కు కూలిని పెం చుతూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయం తీసుకోగా, ఇది ఏప్రిల్ 1నుంచి అమలులోకి రానుంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో కూలిని ఏకంగా రూ.28కి పెంచారు. అంతకు ముం దు రూ.15 పెంచారు. ఈసారి మాత్రం కేవలం రూ.7 మాత్రమే పెంచారు. కూలి ధర పెరగడంతో జిల్లాలోని 5.55లక్షల మం ది ఉపాధి కూలీలకు ప్రయోజనం చేకూర నుంది. కూలి ధర మరింత పెంచితే బాగుం డేదని కూలీలు అభిప్రాయపడుతున్నారు. పెరిగిన కూలి ధరలు వచ్చే నెల ఒకటో తేదీ నుంచి అమలులోకి రానున్నాయని కమ్మర్ పల్లి ఏపీవో విద్యానంద్ 'సాక్షి'తో చెప్పారు.

అమ్మవారికి వెండి వీణ బహూకరణ



బాసర : బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవా రికి దాతలు ఆదివారం వెండివీణ బహూక రించారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన నవ్యభారతి గ్లోబల్ హైస్కూల్ సంస్థ చైర్మన్ క్యాతం శ్రీదేవి–సంతోష్ దంపతులు రూ. 5 లక్షలు వెచ్చించి 4 కేజీల వెండితో తయారు చేయించిన వీణను బహూకరించారు. ఈ సందర్భంగా అర్చకులు దాతలకు తీర్థప్రసా దం అందజేసి శాలువాతో సత్కరించారు.

రంజాన్‌కు ట్రాఫిక్ మళ్లింపు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగరంలో రం జాన్ పండుగ సందర్భంగా సోమవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపులు ఉం టాయని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ ఒక ప్రక టనలో తెలిపారు. బోధన్ వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఇతర భారీ వాహనాలు బస్టాండ్ నుంచి బయలు దేరి జెడ్పీ మీదుగా బైపాస్ రోడ్డు, అర్సపల్లి రైల్వే గేటు, అర్సపల్లి మీదుగా బోధన్ వెళ్లాలి. బోధన్ నుంచి నిజా మాబాద్ వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహ నాలు అర్సపల్లి రైల్వే గేట్ మీదుగా న్యూ కలెక్టరేట్, బైపాస్ మీదుగా నగరానికి రావాలి. కామారెడ్డివైపునుంచి బోధన్ వెళ్లా లనుకుంటే మాధవ నగర్ బైపాస్, కంఠేశ్వర్ బైపాస్, అర్సపల్లి రైల్వే గేటు మీదుగా బోధన్ చేరుకోవాలన్నారు. నగర ప్రజలు ఈ విషయాన్ని గమనిస్తూ తమ ప్రయాణాలు చేసుకోవాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

సెలవులే.. మృత్యు శరములై..

- వరుస సెలవుల నేపథ్యంతో ఇంటికి వచ్చిన పిల్లలు
- చెరువు వద్ద ఆడుకుంటుండగా ప్రమాదం
- నీటమునిగి మృత్యువాత
- ఒకే కుటుంబంలోని నలుగురి మృతితో తీవ్ర విషాదం

వరుస సెలవులు ఆ పిల్లల పాలిట మృత్యుశరాలయ్యాయి. సెలవుల సందర్భంగా ఇంటికి వచ్చిన ముగ్గురు పిల్లలు చెరువు వద్దకు వెళ్లి ఆడుకుంటూ నీట మునిగారు. వారిని కాపాడే క్రమంలో పినతల్లి సైతం మృత్యువాతపడింది. ఈ ఘటన ఎల్లారెడ్డి మండలంలోని వెంకటాపూర్ అగ్రహారంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

ఎల్లారెడ్డిరూరల్ : వెంకటాపూర్ అగ్రహారం గ్రామానికి చెందిన బొమ్మర్తి లింగయ్య అలియాస్ ఏసుకు గతంలో ఎల్లారెడ్డి మండలంలోని కల్యాణి గ్రామానికి చెందిన శ్యామలతో వివాహమైంది. వీరికి ఇద్దరు కూతుళ్లు మైథిలి, అక్షర, కుమారుడు వినయ్ ఉన్నారు. శ్యామల అనారోగ్యంతో కొన్నేళ్ల క్రితం చనిపోవడంతో మెదక్ జిల్లాకు చెందిన మరొకరిని వివాహం చేసుకున్నాడు. అయితే వారి మధ్య మనస్పర్థలు రావడంతో నెలరోజులకే విడిపో యారు. అనంతరం లింగయ్య లింగంపేట మండ లంలోని శెట్పల్లి గ్రామానికి చెందిన మౌనికను పెళ్లి చేసుకున్నాడు. వీరిద్దరికి ఒక కూతురు జన్మించింది.



విలపిస్తున్న మృతుల బంధువులు

ఆమె ఆరునెలల వయసులో అనారోగ్యానికి గురై మృతిచెందింది. సవతి పిల్లలైన మైథిలి, అక్షర, విన య్‌లను సొంత పిల్లలుగా చూసుకుంటూ కాలం గడుపుతోంది.



మృతుల కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృ తుడి కుటుంబాన్ని ఆదుకుంటామని పేర్కొన్నారు.

సెలవులకు ఇంటికి రావడంతో..

మెదక్‌లోని వెస్లీ పాఠశాలలో మైథిలి ఆరో తరగ తి, అక్షర ఐదో తరగతి చదువుతున్నారు. వీరు అ క్కడే హాస్టల్‌లో ఉండేవారు. కుమారుడు వినయ్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మూడో తర గతి చదువుతున్నాడు. రెండు రోజులు సెలవులు రావడంతో ఈనెల 26న లింగయ్య ఇద్దరు కూతు ళ్లను ఇంటికి తీసుకునివచ్చాడు. శనివారం మౌనిక బట్టలు ఉతికేందుకు చెరువు వద్దకు వెళ్తూ పిల్లలను వెంట తీసుకువెళ్లింది. మౌనిక బట్టలు ఉతుకుతుండగా ముగ్గురు పిల్లలు చెరువులో దిగి స్నానాలు చేశారు. ఈ క్రమంలో విషాదం చోటు చేసుకుంది. పిల్లలు గుంతలో మునిగిపోతుండ డాన్ని గమనించిన మౌనిక వారిని కాపాడేందుకు చెరువులో దిగి ఆమె సైతం నీటమునిగి చనిపో యి ఉంటుందని భావిస్తున్నారు. ఒకే కుటుంబా నికి చెందిన నలుగురు చనిపోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇద్దరు కూతు ళ్లను సెలవులలో ఇంటికి తీసుకుని రాకపోయి ఉం టే వారు బతికే వారేమోనని గ్రామస్తులు, బంధు వులు చర్చించుకున్నారు.

అల్ప్రాజోలం సరఫరా ముఠా అరెస్ట్

- ముగ్గురు నిందితుల రిమాండ్. పరారీలో మరొకరు..
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రాజేశ్ చంద్ర



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు, అల్ప్రాజోలం, ముడి సరుకు

కామారెడ్డి క్రైం : కల్తీ కల్లులో వినియోగించే నిషేధిత మత్తు పదార్థం అల్ప్రాజోలంను సరఫరా చేస్తున్న ఓ ముఠా సభ్యులను ఆదివారం అరెస్టు చేసి రిమాం డ్‌కు తరలించినట్లు ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జిల్లాలోని మద్నూర్ గ్రామా నికి చెందిన ఉదాలత్‌వర్ సురేశ్‌గౌడ్ ఇంటిపై ఆది వారం పోలీసులు దాడులు నిర్వహించారు. తనిఖీ ల్లో 110 గ్రాముల అల్ప్రాజోలం పట్టుబడింది. సురేశ్‌గౌడ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నిషేధిత అల్ప్రాజోలంను హైదరాబాద్ శివారు ప్రాంతంలోని నాచారంలో ఉండే వ్యాపారి దినేష్‌కు మార్ మొహంతి వద్ద నుంచి కొనుగోలు చేశానని చెప్పాడు. దీంతో పోలీసులు సురేశ్‌ను వెంట తీసు కుని నాచారంలోని దినేష్ కుమార్ వద్దకు వెళ్లి విచా రించారు. నాచారంలోని టెంపుల్ ఆర్గానిక్ ల్యాబ్ లో ఉండే కృష్ణ అనే వ్యక్తి వద్ద నుంచి వారు అల్ప్రా జోలం కొనుగోలు చేసినట్లు గుర్తించారు. కృష్ణ అ ల్ప్రాజోలంను ఇతర ముడి సరుకులతో కలిపి త యారు చేసి సురేశ్‌గౌడ్‌తోపాటు మద్నూర్‌కు చెంది న శ్రీనివాస్‌గౌడ్‌కు చాలాసార్లు విక్రయించినట్లు పో లీసుల విచారణలో వెల్లడైంది. కృష్ణ వద్ద 153 గ్రా ముల అల్ప్రాజోలం, 4 సెల్‌ఫోన్లు, 8 రకాల ముడి సరుకులను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవ హారంలో ఇప్పటి వరకు సురేశ్‌గౌడ్, దినేష్ కుమార్ మొహంతి, కృష్ణలను అరెస్టు చేసి, రిమాండ్‌కు తర లించామని ఎస్పీ తెలిపారు. శ్రీనివాస్‌గౌడ్ పరారీ లో ఉన్నాడని పేర్కొన్నారు.

రేపటి నుంచి రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్: రేషన్ బియ్యం పంపిణీ మంగళవారంనుంచి ప్రారంభం కానుందని పౌరసరఫరాల శాఖ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆహార భద్రత కా ర్డులపై ఒక్కో యూనిట్‌కు ఆరు కిలోల సన్న బియ్యం ఉచితంగా ఇస్తామని పేర్కొన్నారు. అంత్యోదయ కార్డులకు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డులకు 10 కిలోల చొప్పున అందిస్తామని తెలిపారు. 15వ తేదీ వరకు బియ్యం పంపిణీ కొనసాగుతుందని పేర్కొన్నారు.

ఎన్యుమరేటర్లకు పైసలెప్పుడిస్తరో?

- ఇంకా అందని సమగ్ర కుటుంబ సర్వే పారితోషికం
- నాలుగు నెలలు గడిచినా విడుదల కాని నిధులు

బీబీపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు సంబంధించి ఎన్యుమరేటర్లకు ఇప్పటికీ పారితోషికాలు అందించలేదు. నెలలు గడు స్తున్నా డబ్బులు రాకపోవడంతో వారు ఆం దోళన చెందుతున్నారు. గతేడాది నవంబర్‌లో సమగ్ర సర్వే నిర్వహించిన విషయం తెలిసిందే. జిల్లా వ్యాప్తంగా 2,97,300 కుటుంబాలను 2,366 మంది ఎన్యుమరేటర్లు, 237 మంది సూపర్‌వైజర్లు సర్వే చేశారు. ఈ వివరాలను సుమారు 800 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కాగా సర్వే నిర్వ హించినందుకు ఎన్యుమరేటర్లకు రూ. 10 వేలు, సూపర్‌వైజర్లకు రూ.12 వేల చొప్పున పారితో షికం ఇస్తామని అప్పట్లో ప్రభుత్వం ప్రకటించిం ది. డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ఒక్కో దరఖా స్తుకు రూ.30 చొప్పున చెల్లిస్తామని పేర్కొంది. కానీ సర్వే పూర్తై నాలుగు నెలలు దాటినా ఇప్ప టికీ ఒక్కపైసా కూడా నిధులు విడుదల చేయ లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పారితోషికానికి సంబంధించిన నిధులు విడు దల చేయాలని ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు కోరుతున్నారు.



బీబీపేటలో డాటా ఎంట్రీ చేస్తున్న ఆపరేటర్లు (ఫైల్)

ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు



సర్వేకు సంబంధించిన డాటా ఎంట్రీ చేశాను. నాలు గు నెలలు దాటినా ఇప్పటివరకు రూపాయి కూడా ఇవ్వలేదు. రోజూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా. ప్రభుత్వం ఇప్పటికైనా మాకు రావాల్సిన డబ్బులు ఇవ్వాలి.

– రాజు, డాటా ఎంట్రీ ఆపరేటర్, తుజాల్‌పూర్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం



సమగ్ర సర్వేలో పాల్గొన్న ఎన్యుమరేటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు సంబంధించిన పారితోషికం ఇంకా విడుదల కాలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకువెళ్లాం. ప్రభుత్వం నిధులివ్వ గానే అందిస్తాం.

– పూర్ణచంద్రోదయకుమార్, ఎంపీడీవో, బీబీపేట

క్లుప్తంగా

పలువురికి సన్మానం



కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామంలో మన ఊరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీచర్, ఆర్మీ ఉద్యోగం సాధించిన దివ్య, కె అజయ్‌ను ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు సున్నపు సత్యనారాయణ, కొల్మి సురేశ్‌రెడ్డి, యూనుస్, కొలిమి భీంరెడ్డి, కె రాజ్‌కుమార్‌రెడ్డి, సీహెచ్ రాజేందర్‌రెడ్డి, కె ప్రభాకర్, ఆర్ స్వామి, జి లింగారెడ్డి, బి శ్యాంరావు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న జాతర



భిక్కనూరు: మండల కేంద్రంలో మల్లన్న జాతర ఆదివారం జరిగింది. అతిపురాతనమైన మల్లన్న ఆలయంలో భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాంపూర్ తండాలో పొరాదేవి పీఠాధిపతి పర్యటన



బాన్సువాడ రూరల్: మండలంలోని రాంపూర్ తండాలో ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన దేశాయిపేట్ సొసైటీ వైస్ చైర్మన్ అంబర్‌సింగ్ కుటుంబాన్ని ఆదివారం మహారాష్ట్రలోని పొరాదేవి పీఠాధిపతి, ఎమ్మెల్సీ శ్రీబాబుసింగ్ పరామర్శించారు. అంబర్‌సింగ్ గిరిజన సమస్యలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారని గుర్తు చేశారు. ఆయన వెంట బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు నేనావత్ బద్యానాయక్, రణజ్యనాయక్, ప్రకాశ్, ఫకీరా నాయక్, చాజ్యనాయక్, చందర్, రాముురాథోడ్ తదితరులు ఉన్నారు.

ప్రజలు అద్భుత విజయాలు అందుకోవాలి

- ఉగాది వేడుకల్లో ఎమ్మెల్యేలు పోచారం, మదన్‌మోహన్‌రావు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు



కాలభైరవ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



బీర్కూర్ మండలం తిమ్మాపూర్ వేంకటేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: ప్రజలు అద్భుత విజయాలు అందుకోవాలని వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఉగాదిని పురస్కరించుకుని బీర్కూర్ మండలం తిమ్మాపూర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పోచారం ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి శ్రీలక్ష్మీగోదా సమేత వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పంచాంగ శ్రావణం వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు ఆనందంగా ఉండాలని భగవంతుడిని వేడుకున్నట్లు చెప్పారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో రూ.50.50 లక్షల నిధులతో నూతనంగా నిర్మించే గ్రంథాలయ భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు పోచారం శంభూరెడ్డి తదితరులు ఉన్నారు.

కాలభైరవుడి ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

రామారెడ్డి: కాలభైరవుడి ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. రామారెడ్డి మండల కేంద్రంలో కాలభైరవుడి ఆలయంలో ఉగాదిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. తాను కాలభైరవ ఆలయ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి రూ.కోటి నిధులను మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. త్వరలోనే ఆలయ కమిటీని నియమిస్తామని అన్నారు. శ్రీ సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

గంగమ్మ వాగు బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన పనులను వేగవంతం చేసి వర్షాకాలంలోపు బ్రిడ్జిని అందుబాటులోకి తెస్తామని అన్నారు. అనంతరం రామారెడ్డిలోని మసీదును సందర్శించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మా గౌడ్, ప్రవీణ్ గౌడ్, తూర్పు రాజు, రవూఫ్, నామాల రవి, రంగు రవీందర్ గౌడ్, అరవింద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది నూతన ఆశయాలకు నాంది

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

భిక్కనూరు: ఉగాది పండగ నూతన ఆశయాలకు నాంది పలుకుతుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. ఆదివారం ఉగాది సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి ఉగాది పచ్చడిని అందజేశారు. ఉగాది పండగ రైతులకు ఎంతో మేలు చేస్తుందని షబ్బీర్‌అలీ అన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీరాం వెంకటేశ్, నేతలు కందడి బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.



షబ్బీర్‌అలీకి ఉగాది పచ్చడిని అందజేస్తున్న ఇంద్రకరణ్‌రెడ్డి

ప్రారంభమైన నల్లపోచమ్మ ఆలయ జాతర

నాగిరెడ్డిపేట: మండలంలోని గోపాల్‌పేటలో పోచమ్మ ఆలయ జాతర, ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు ఎడ్లబండ్ల ప్రదర్శన చేపట్టారు. ఎడ్లబండ్ల ప్రదక్షణలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



ఎడ్లబండ్లను ఊరేగిస్తున్న భక్తులు

రసవత్తరంగా కుస్తీ పోటీలు



గాంధారి మండలం నేరల్‌లో కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

బాన్సువాడ/ గాంధారి: ఉగాది పండగను పురస్కరించుకుని పలు గ్రామాల్లో నిర్వహించిన కుస్తీ పోటీలు రసవత్తరంగా మారాయి. బాన్సువాడ మండలంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో కుస్తీ పోటీలు నిర్వహించారు.

తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన మల్లయోధులు పోటీల్లో తలపడ్డారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు యామ రాములు, అవారి గంగారాం, యాట వీరేశం, పోగు నారాయణ, శశికాంత్, పర్శు నారాయణ తదితరులు ఉన్నారు. గాంధారి మండలం నేరల్ గ్రామంలో ఉగాది సందర్భంగా కుస్తీ పోటీలు నిర్వహించారు. విజేతలకు గ్రామ కమిటీ, గ్రామస్తులు నగదు బహుమతులు అందజేశారు.

ఐక్యమత్యంతో ముందుకు సాగాలి

బాన్సువాడ రూరల్: ముదిరాజ్‌లు ఐక్యమత్యంతో ముందుకు సాగాలని బోర్లం గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కాదిరెడ్డి రమేశ్ అన్నారు. ఉగాదిని పురస్కరించుకుని ఆదివారం గ్రామంలోని ముదిరాజ్ సంఘ భవనం వద్ద ముదిరాజ్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బొంబాయి హన్మాండ్లు, టేకుల రమేశ్, గంగాధర్, సింగరి సాయిలు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారెడ్డిలో..

నాగిరెడ్డిపేట: మండలంలోని ధర్మారెడ్డిలో ముదిరాజ్ కులస్తులు సంఘం జెండాను ఆవిష్కరించారు. ఉగాదిని పురస్కరించుకొని జెండాను ఎగురవేశారు. సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



బోర్లంలో జెండాను ఆవిష్కరిస్తున్న ముదిరాజ్‌లు

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి



బాన్సువాడ రూరల్: పండుగలను ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా జరుపుకోవాలని బాన్సువాడ సీఐ అశోక్ కోరారు. ఆదివారం ఆయన బోర్లం గ్రామంలో ఉన్న మసీదులో ముస్లిములకు రంజాన్ సందర్భంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సయ్యద్ అయ్యూబ్, శంశేర్‌ఖాన్, సయ్యద్ జలీల్, సలీం, మహిబూబ్, అర్షద్‌ఖాన్, అమీన్, హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి



బాన్సువాడ రూరల్: మండలంలోని హన్మాజీపేట్ జీపీ పరిధిలోని ఛత్రూనాయక్ తండాకు రోడ్డు సౌకర్యం కల్పించాలని తండా వాసులు కోరుతున్నారు. తండాలో 20 కుటుంబాలు నివాసం ఉంటున్నా, నేటికి రోడ్డు సౌకర్యం లేదు. దీంతో తండా వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి తమకు రోడ్డు సౌకర్యం కల్పించాలని వారు కోరుతున్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



ఎల్లారెడ్డిరూరల్: మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఉస్మానియా మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఇఫ్తార్ విందులో ముస్లిములకు ఎమ్మెల్యే పండ్లు తినిపించారు. కార్యక్రమంలో గఫార్, ఆరీఫ్, గయాజుద్దీన్, పద్మశ్రీకాంత్, కుడుముల సత్యనారాయణ, ప్రశాంత్‌గౌడ్, సాయిబాబా, వినోద్‌గౌడ్, వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సామెల్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



నాగిరెడ్డిపేట: మండలంలోని గోపాల్‌పేట ఆర్టీసీ బస్టాండ్‌లో కంట్రోలర్ మోహన్‌రావు సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌రావు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్, నాగిరెడ్డిపేట ఎస్సై మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల కౌలు వేలం



మద్నూర్: మండల కేంద్రంలో లక్ష్మీనారాయణ ఆలయ భూములకు కౌలు వేలం నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఆలయానికి చెందిన ఏడు ఎకరాల 26 గుంటల భూమి మద్నూర్ శివారులో మూడు చోట్ల ఉందన్నారు. ఆలయ భూములను నాగంవార్ వెంకన్న, వట్నాల్‌వార్ సాయన్న, వంకాయల్‌వార్ నాగన్న ముగ్గురు వేలంలో పాల్గొని ఆలయ భూములను కౌలు చేయడానికి ముందుకు వచ్చినట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కారు బోల్తా పడి నలుగురికి గాయాలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని కుప్రియాల్ గ్రామ శివారులో గల 44వ నెంబర్ జాతీయ రహదారిపై ఆదివారం ఓ కారు అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో కారులోని నలుగురికి గాయాలయ్యాయి. నిర్మల్ జిల్లాకు చెందిన రాజశేఖర్ కుటుంబ సభ్యులు హైదరాబాద్ నుంచి నిర్మల్‌కు వస్తుండగా ప్రమాదవశాత్తు కారు రోడ్డు కిందికి దూసుకెళ్లింది. ఘటనపై సదాశివనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఎడపల్లి(బోధన్): ఇటీవల ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని జంలం గ్రామానికి చెందిన లావణ్య (45) ఆర్థిక పరిస్థితి బాగాలేక ఈనెల 26న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే స్థానికులు గమనించి ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. లావణ్య భర్త పదేళ్ల క్రితం మృతి చెందాడు. మృతురాలి అత్తమ్మ సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎడపల్లి పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని శివాజీ చౌక్ ఏరియాలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఘటన స్థలంలో మృతదేహాన్ని పోలీసులు పరిశీలించి, వివరాలు సేకరించారు. మృతుడు భిక్షాటన చేసేవాడై ఉంటాడని, వడదెబ్బ కారణంగా మృతిచెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. ఒంటిపైన తెలుపు రంగు షర్టు, నలుపు రంగు పాయింట్ ధరించినట్లు తెలిపారు. ఎవరైనా మృతుడిని గుర్తిస్తే ఫోన్ నెంబర్ 8712659839, 8712659717ను సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని బోర్గాం(పి) శివారులో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ ఆదివారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం రావడంతో పేకాట స్థావరంపై దాడి చేసి, నలుగురిని పట్టుకున్నట్లు తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి రూ.44,720 నగదు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నగరంలోని సాయి నగర్, గాయత్రినగర్‌లో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. పేకాటాడుతున్న ఏడుగురిని పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ ఆదివారం తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి రూ.3,710 నగదు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కాడెద్దులు @ రూ.3వేలు

- కనుమరుగవుతున్న ఎడ్లబండ్లు
- ఉగాది ఎడ్లబండ్ల ప్రదర్శన కోసం అద్దెకు తీసుకుంటున్న భక్తులు



నారాయణ్‌ఖేడ్ ప్రాంతం నుంచి అద్దెకు తెచ్చిన ఎద్దులు

నాగిరెడ్డిపేట: అన్నదాతకు తోడుగా ఉండే కాడెద్దులు కాలక్రమేణా కనుమరుగవుతున్నాయి. యాంత్రీకరణ అందుబాటులోకి రావడంతో రైతులు సైతం కాడెద్దులను వీడి ట్రాక్టర్ల బాటపట్టారు. ఫలితంగా కాడెద్దుల బండ్లు కనిపించడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఒకరిద్దరి వద్ద మాత్రమే ఎడ్లు, బండ్లు ఉంటున్నాయి. ఇదిలా ఉండగా గ్రామాల్లో జరిగే జాతరల్లో ఎడ్లబండ్ల ప్రదర్శనే ప్రధానం. ప్రస్తుతం ఎడ్లబండ్ల ఉనికి లేకపోవడంతో ఉత్సవాల కోసం వేల రూపాయలు వెచ్చించి ఇతర గ్రామాల నుంచి ఎడ్లబండ్లను అద్దెకు తీసుకొస్తున్నారు. మరికొందరు లక్షలు పెట్టి కొనుగోలు చేసి ఎడ్లబండ్ల ప్రదర్శన ముగిసిన తర్వాత వాటిని అమ్మేస్తున్నారు. నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేట్‌లో ఉగాది వేడుకలను ఏటా వైభవంగా నిర్వహిస్తారు. నాగిరెడ్డిపేట, గోపాల్‌పేట, చీనూర్, వాడి, లింగంపల్లి, మాల్తుమ్మెద, గోలిలింగాల, వదల్‌పర్తి, బంజర తదితర గ్రామాలకు చెందిన భక్తులు గోపాల్‌పేటకు వచ్చి శ్రీ నల్లపోచమ్మ ఆలయం చుట్టూ ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహిస్తారు. ఒక్కో జత ఎడ్లకు రూ.3వేలు నుంచి రూ.5వేలు చెల్లించి, ఒక్కో బండికి నాలుగైదు జతల ఎడ్లను కట్టి ప్రదర్శనలో తిప్పుతారు. ఇలా ఉత్సవాల్లో ఎడ్లబండిని తిప్పడానికి సుమారు రూ.50 వేల వరకు ఖర్చు చేస్తుండడం విశేషం.



లింగంపల్లికలాన్ గ్రామానికి చెందిన కలాలి గోపాల్‌గౌడ్ గోపాల్‌పేటలో జరిగే ఉగాది ఉత్సవాలకు రూ.1.85 లక్షలు వెచ్చించి రెండు జతల ఎడ్లను కొనుగోలు చేశాడు. ప్రదర్శన అనంతరం ఎడ్లను తిరిగి అమ్మేస్తానని గోపాల్‌గౌడ్ తెలిపారు.

వృద్ధురాలి మృతదేహం లభ్యం

రుద్రూర్: మండలంలోని లింగంపల్లి శివారులో ఓ వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. స్థానిక రైతులు ఆదివారం మధ్యాహ్నం మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. మృతురాలు కోటగిరి మండలం ఎత్తోండా గ్రామానికి చెందిన దేగావత్ లక్ష్మీబాయి (62)గా గుర్తించారు. ఈనెల 26 నుంచి లక్ష్మీబాయి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు కోటగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మతిస్థిమితం లేకపోవడం, గత నాలుగు రోజులుగా ఆహారం లేనందున ఆరోగ్యం క్షీణించి మృతిచెంది ఉంటుందని భావిస్తున్నారు. ఈమేరకు మృతురాలి భర్త లింబ్యా నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్సై రాజు

హత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు

బాన్సువాడ: మండలంలోని కొల్లూర్ సమీపంలో ఇటీవల జరిగిన అమృతం విఠల్ హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ అశోక్ తెలిపారు. ఈమేరకు బాన్సువాడ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయన వివరాలు వెల్లడించారు. బాన్సువాడ మండలం నాగారం గ్రామానికి చెందిన అమృతం విఠల్(34) అనే వ్యక్తిని ఈ నెల 29న కొల్లూర్ సబ్ స్టేషన్ సమీపంలో దారుణంగా హత్య చేసి మృతదేహాన్ని రోడ్డుపై పడేసి వెళ్లారు. పోలీసులు గ్రామంలో విచారించగా మృతుడి భార్య కాశవ్వ గ్రామానికి చెందిన అమృతం విఠల్ అనే వ్యక్తితో ఐదేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తుంది. దీంతో భర్తకు దీర్ఘకాలిక వ్యాధి ఉండటంతో అతడి అడ్డు తొలగించుకోవాలని కాశవ్వ నిర్ణయించుకుంది. తన భర్తను చంపితే డబ్బులు ఇస్తానని చెప్పి కాశవ్వ తన బంగారాన్ని తనఖా పెట్టి ఈ నెల 28న రూ.18 వేలు తెచ్చి నిందితుడు విఠల్‌కు ఇచ్చింది. అదేరోజు నిందితుడు విఠల్‌ను మోటార్ సైకిల్‌పై ఎక్కించుకుని దుర్కికి తీసుకెళ్లాడు. అక్కడ అతడికి కల్లు తాగించి, అనంతరం పుల్కంటి విఠల్, అమృతం విఠల్ కలిసి గొంతుకు టవల్ బిగించి పైపులతో కొట్టి చంపారు. మృతి దేహాన్ని కొల్లూర్ సబ్ స్టేషన్ సమీపంలోని బాన్సువాడ-బీర్కూర్ ప్రధాన రహదారిపై పడేసి వెళ్లారు. విచారణ అనంతరం కాశవ్వ, అమృతం విఠల్, పుల్కంటి విఠల్‌ను పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.



వివరాలను వెల్లడిస్తున్న సీఐ అశోక్

ఎడ్లబండ్ల ప్రదర్శనలో అపశృతి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని గోపాల్‌పేటలో ఆదివారం జరిగిన ఉగాది ఉత్సవాలలో అపశృతి చోటుచేసుకుంది. ఎడ్లబండ్ల ప్రదర్శన కొనసాగుతుండగా బండి నుంచి తాడును తెంపుకున్న ఎద్దు బెదిరిపోయి జనాలపైకి దూసుకెళ్లింది. కాగా ఉత్సవాలను తిలకించేందుకు మెదక్ జిల్లా తిమ్మాయిపల్లి నుంచి వచ్చిన కర్రోల నాగమణి అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే గోపాల్‌పేటకు చెందిన రాజ్‌పేట మాధవి అనే మహిళ తలకు తీవ్రగాయమైంది. వీరితోపాటు మరికొంతమంది గాయపడినట్లు స్థానికులు తెలిపారు. ఘటనలో గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రులకు తరలించి చికిత్స అందించారు.

రోగులకు పండ్ల పంపిణీ



బాన్సువాడ: వారధి స్వచ్ఛంద సేవా సంస్థను ప్రారంభించి 15 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సంస్థ సభ్యులు ఆదివారం ప్రభుత్వం ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, సభ్యులు మహేందర్, సుధాకర్, వేణుగోపాల్, గోపాల్‌సింగ్ ఠాకూర్, కృష్ణ, కోటయ్య, శ్రీనివాస్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నరేంద్రాచార్య మహరాజ్ పల్లకీ యాత్ర



మద్నూర్‌లో మహరాజ్ పల్లకీ శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



శివాజీ వేషధారణతో గుర్రంపై యువకుడు

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలో శ్రీ అనంత్ విభూషిత్ జగద్గురు రామానందచార్య శ్రీ స్వామి నరేంద్రాచార్య మహరాజ్ పల్లకీ శోభాయాత్ర ఆదివారం వైభవంగా జరిగింది. ఉగాది సందర్భంగా హిందూ నూతన సంవత్సర స్వాగత శోభాయాత్ర, భజన కార్యక్రమాన్ని చేపట్టారు. మహిళలు, యువతులు నృత్యాలు చేస్తూ కలశాలతో, కాషాయపు జెండాలతో శోభాయాత్ర నిర్వహించారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ వేషధారణలో ఓ యువకుడు గుర్రంపై ఊరేగింపులో పాల్గొన్నాడు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.